శ్రీ రమణ జ్యోతి Sri Ramana Jyothi
జూన్ 2021 June 2021

ఈ సంచికలో ... IN THIS ISSUE ...

1. డా॥ కే.యస్. గారి 83వ ప్రవచనం — డా॥ వి. రామదాస్ మూర్తి 3
2. శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు — మల్లాది ఫణిమాల 10
3. శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్) — జి. శ్రీహరిరావు 20
4. శ్రీరమణ మహర్షి సూక్తులు — కమలాకర వేంకటరావు 28
5. Overcoming Fear — Dr. K. Subrahmanian 30
6. Kavyakantha's Chatvarimsat — V. Krithivasan 39
7. Glimpses of Arunachala: Part II — Swagat Patnaik 42
8. Ekatma Panchakam 46

**Events in Sri Ramana Kendram in June 2021**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 13th - Sunday - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.

(Devotees may please note that due to social distancing, *satsangs* are being held online. For details please contact Kendram Office)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# ముందు చూపు మంచిది

డా॥ కే.యస్. గారి 83వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

అమృతత్వం అంటే ఏమిటి? 'మృత' - మరణం. అమృత మరణమంటే అందరికీ భయం. జీవించి వుండడంలో సుఖ ముందని అందరం భావిస్తాం. దేనినైనా భరించి, జీవించి వుండ డానికి సిద్ధంగా వుంటాం. వ్యక్తి భయంకరమైన వ్యాధితో బాధపడుతూ వుండవచ్చు. అతడెంతో బాధను అనుభవిస్తున్నాడని ఇతరులు అనుకోవచ్చు. అతను మరణిస్తే బాధలుండవని భావిస్తారు. కాని ఆ వ్యక్తి ఆ భావనతో వుండడు. మరి కొన్నేళ్ళు జీవించి వుండడానికి ఆశిస్తాడు. అందరి విషయంలోనూ అదే వుంటుంది. మరణించడానికి ఎవ్వరూ ఇష్టపడరు. ఏవో కొన్ని ప్రత్యేక సందర్భాలు వుండి వుండవచ్చు. ఎవరైనా ఆత్మహత్య చేసుకుందా మనుకునేవాళ్ళు జీవితం దుర్భరమైనప్పుడు తనువు చాలించాలను కోవచ్చు. కాని సర్వసాధారణంగా పరిస్థితి వేరుగా వుంటుంది. బ్రతికి వుండడంలో ఆనందముందనుకుంటాం.

## మానవ స్వభావం

ప్రతిరోజూ ప్రొద్దున కొంత చిరుతిండి, మధ్యాహ్నం భోజనం, తరువాత టీ త్రాగడం, ఆ తరువాత రాత్రి మళ్ళీ భోజనం - ఇలా దైనిక యాత్ర మార్పు లేకుండ సాగిపోతూ వుంటుంది. పడుకోవడం, లేవడం, ఇతరులతో బాతాఖానీ జరుగుతుంటుంది. ఏళ్ళ కొద్దీ,

ఇలా సాగుతూ, సుఖ, దుఃఖాలను అనుభవించడం, కొన్ని సందర్భా లలో క్రుంగిపోవడం - ఇవి జీవనయాత్రలో నిత్యం జరిగేవే. ఇలా ప్రతి రోజు దాదాపు ఇలా గడచిపోతుంది. ఆసక్తికరమైన పని ఏమీ లేనప్పుడు మాత్రం ఎంతో విసుగ్గా వుందని అంటాం. కాని జీవితం గురించి అలా అనం. వీలైనంత కాలం బ్రతికి వుండాలని ఆశిస్తాం. అలాగని మనల్ని ఎవరు ముసలి వాడంటే ఇష్టపడం. అందరూ చిన్న వయసు వాళ్ళమనే అనుకుంటాం. అది మానవ స్వభావం.

ఒక ప్రదేశంలో పుట్టి, పెరిగినవాళ్ళమైతే, అక్కడి ప్రాంతాన్ని మనం ఎవరికైనా చూపించాల్సి వచ్చినప్పుడు, వారితో ఈ దేవాలయం, ఇది ఎనిమిది వందలు లేదా వెయ్యేళ్ళ కాలం పురాతనమైనదని చెబుతాం. మనకు గర్వకారణం అయినప్పుడు అలాగే ఈ పట్టణం చాలా పురాతనమైనది, మా ఋగ్వేదం ఫలానా ఏళ్ళ నాటి కాలానికి చెందినది అని వర్ణిస్తాం. ఆ సమయంలో పాతది, అనీ అదే పురాతన వస్తువైతే ఇంత ఖరీదైనదనీ చెప్పకుంటాం. ఏ వస్తువునో కొన్ని ప్రక్రియలతో మార్చి పురాతనమైనదని నమ్మిస్తాం. అదే మనుష్యుల విషయానికి వచ్చినప్పుడు, ఎవరూ తమను వృద్ధులని పిలువబడ డానికి ఒప్పుకోము. పురాతనత్వం మనిషికి వర్తించదు. అది వస్తువులకో, స్థలానికో మాత్రమే పరిమితం. వస్తువులలో పురాతనత్వాన్ని మెచ్చుకొనే మనం, ఏ కొద్ది మంది విషయంలో తప్ప, అందరూ చిన్న వయసు వాళ్ళమేనని భావిస్తాం, కోరుకుంటాం.

ఆదిశంకరులవారు - మా కురు ధన జన యౌవన గర్వం, హరతి నిమేషాత్కాలం సర్వం, మాయా మయమిద మఖిలం హిత్వా, బ్రహ్మపదం త్వం ప్రవిశవిదిత్వాః అంటారు. వయసులో వున్నప్పుడు యౌవన గర్వంతో వుంటాం. వృద్ధుల గురించి, పాత అభిప్రాయాల గురించి ఎగతాళి చేస్తాం. ఇంకా ఎన్నో విధాల వృద్ధాప్యం గురించి తేలిక స్వభావం కనబరుస్తాం. వయసులో వున్న కాలంలో తాము వృద్ధులమవుతామని ఎప్పుడూ ఆలోచించం. తాము వృద్ధులం ఎప్పుడూ కామని, అలాగే విచిత్రంగా తాము ఎప్పుడూ మరణించమన్న భావనలో వుంటాం. మరణం వందేళ్ళ దూరంలో వుందనుకుంటాం. వయసులో వున్న వారికి మరణం గురించిన ధ్యాసే వుండదు. అదే విధంగా వృద్ధులు మరణం గురించి ఆలోచించక వుండడం కష్టం. ఎవరో మరణించారన్న వార్త వృద్ధులను ఒక్క కుదుపు కుదుపుతుంది. ఇదీ మానవ నైజమే.

## మంచివారికీ వర్తిస్తుంది

ధన జన యౌవన గర్వం - నా దగ్గర బోలెడు డబ్బులున్నాయి, దాంతో జనాన్ని సుఖాన్ని కొనగలనని తలిస్తే అది యౌవన గర్వమని పించుకుంటుంది. అలాగే, బంధువులు, స్నేహితులు సహాయ పడతారనుకోవడం కూడా అంతే. ఆ గర్వం పనికిరాదంటారు శంకరులు. ఇప్పుడు ఇంకా చిన్న వయసులో వున్నామనుకున్నంత మాత్రాన యముడు వందేళ్ళ పాటు నిన్ను తాకననుకోడు. అదే ధనవంతుని విషయంలోనూ వర్తిస్తుంది. సమయం వచ్చినప్పుడు

అవన్నీ సమకూరుతాయి, అవేవీ వ్యక్తిని కాపాడలేవు. గాంధీజీ అన్నట్లు నిర్ణీత సమయం వచ్చినప్పుడు, ఒక సెకండు ముందు గాని, ఒక సెకండు ఆలస్యంగా కాని కాకుండ, నీవు ఈ ప్రపంచాన్ని వదలి వెళ్ళిపోతావు. అందుకే యముడిని యమధర్మరాజు అంటారు. ఎందుకంటే అతనికి ఇష్టాయిష్టాలు లేవు. 'యమ' అంటే 'అదుపు' అని అర్థం. ప్రభుత్వాలకు ప్రజల జీవితాన్ని తీసే శక్తి వుందని ఉదాహరణకు ఊహించండి. అప్పుడు ముఖ్యమంత్రి తనను విమర్శించే వాళ్ళను సమయం కంటే ముందే మరణానికి గురిచేయ గలడు, మెచ్చుకునే వాళ్ళ జీవితాన్ని పొడిగించగలడు.

మరొక విషయం. కేవలం మనం మంచి వాళ్ళుగా వున్నంత మాత్రాన ఎక్కువ కాలం జీవించగలమనుకోవడం పొరబాటు. ఏసుక్రీస్తు ముప్పై రెండవ ఏట శిలువ వేయబడ్డాడు. ఆదిశంకరులు ముప్పై దశకంలో శ్రీరామకృష్ణులు ఏభైవ ఏట, తనువులు చాలించారు. అలాగే గౌతమ బుద్ధుడు ఎనభైవ పడిలో. ఇందులో ఏదైన నిర్ణీత విధానం కనిపిస్తోందా? మనమూ మంచివారిగా బ్రతికితే ఎనభై ఏట వరకు జీవిస్తామన్న నమ్మకం వుందా? లేదు. అందుకే ఏదీ మన చేతిలో లేదంటాం. కాని చిన్న వయసులో వున్నప్పుడు మాత్రం నూరేళ్ళ వరకు జీవించివుండగలమనే ధీమా వుంటుంది. ఒక రోజు, ఆఫీసుకు వెళ్తున్న వ్యక్తిని ఒక ట్రక్కు గుద్దితే చనిపోయాడని, లేదా ప్రయాణికులను తీసుకెళ్తున్న బస్సు నదిలో పడితే, అందరూ చనిపోయారని, ఇలాంటి వార్తలు వింటుంటాం. ఇలాంటి

సంఘటనలు ఎందుకు జరుగుతాయి? మనలో ఎవరికైనా, ఏ క్షణాన్నైనా అలాంటివి జరగవచ్చునని మాత్రం మనకు బోధ పడుతుంది. ఎవ్వరూ ముందుగా చెప్పలేరు.

అందుకే ఆదిశంకరులు 'తస్మాత్ జాగ్రత' అంటారు. ఈ రోజున మీరు బ్రతికి వున్నారంటే అది భగవంతుని కృప. ఆ కారణం చేత కొందరు పడుకోబోయే ముందు దేవునికి తమ కృతజ్ఞతలు తెలియజేసుకుంటారు. అంతేకాదు, మరికొందరు మరుసటి దినం ప్రొద్దున తిరిగి లేవరేమోనని, తాము ఆ రోజున చేసిన పనులన్నిటికి క్షమాపణలు రాత్రి చెప్పుకుంటారు. రోజు తరువాత రోజూ మనం మేలుకొని తిరుగుతున్నామంటే, అది అలాగ ఎప్పటికీ జరుగుతుందని అనుకోవడానికి వీలు లేదు. శంకరాచార్యులు 'హరతినిమేషాత్' - ఒక్క క్షణంలో మనవి అనుకొనే వాటిని అన్నీ తొలగింపబడతాయి. ఈ మొత్తం భ్రమ. జరిగే ప్రతి సంఘటనకూ భగవంతుడే కారణమని గుర్తించాలి. కొన్ని సందర్భాలలో మనం కోరుకున్నవన్నీ దేవుడు ప్రసాదించడు. ఒక్కొక్కసారి మనం బాధపడుతున్నప్పుడు దేవుడు మనల్ని మరచి పోయాడా అన్న అనుమానం పుట్టుకొస్తుంది.

## చివరకు తెలుస్తుంది

ఈ లోకంలో కోటానుకోట్ల జీవులున్నాయి. కుక్కలు, ఎన్నో జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు, కంటికి కనిపించని బ్యాక్టీరియా, అడవిలో వృక్షాలు, క్రూర జంతువులు, ఎన్నో,

యింకెన్నెన్నో. వీధి కుక్క దాని సమయం ఆసన్నమైనప్పుడు అక్కడికక్కడే చనిపోతుంది. వాటన్నిటి సంగతి పట్టించుకుంటున్న దెవరు? నీవు కష్టపడి పనిచేస్తావు? బ్యాంకులో డబ్బులుంటాయి. ఒక కుక్క, పిచుక, వాటికి ఏమున్నాయి? మనలాగ అవి కూడ ఉదయాన్నే లేస్తాయి, బయటకెళ్తాయి. ఎవరైనా పెడితే, లేదా దొరికితే తింటాయి, తిరిగి వచ్చి పడుకునేస్తాయి. ఇలాగ కాలం గడుపుతాయి. వాటికీ, మనిషికీ తేడా ఏమిటి? అవి ఏ రోజుకు ఆ రోజు బ్రతుకుతాయి, లేస్తాయి, తింటాయి, విశ్రాంతి తీసుకుంటాయి, అంతే. కాని మానవుడు మాత్రం అలాగ ఏ రోజు కారోజు జీవించడు. అలాగ బ్రతికే వాళ్ళను బిచ్చగాళ్ళంటాము. వాళ్ళను చిన్న చూపు చూస్తాం. పనిచేసి, సంపాదించి, కొంత డబ్బు వెనకేసుకుంటాం భవిష్యత్తు కోసం. అంతే కాకుండ రాబోయే సమస్యలేమిటి, డబ్బు తగినంత వుండకపోవచ్చు, జబ్బున పడితే ఎలాగ? అలా తలపోస్తూ జీవితమంతా సంపాదించడంలో గడుపుతాం. పోనీ అలాంటప్పుడు సుఖపడతామా? లేదు. ఇక సంపాదించలేని పరిస్థితి చేరేసరికి, పాత రోజులను నెమరేసుకుంటాం. అప్పుడు జనం గౌరవించేవారు, ఇప్పుడది లేదు అన్న దిగులు.

యావద్విత్తోపార్జన సక్తః తావన్నిజపరివారోరక్తః। పశ్చాత్జీవతి జర్జరదేహే వార్తాంకోఽపి నపృచ్ఛతి గేహే । అన్నారు శంకరులు. ఆర్జించుతున్నంత కాలం, పరివారము, దగ్గరివారు అందరూ ఆదరిస్తూంటారు. మనమూ మరింత కష్టపడుతూ పనిచేస్తుంటాం.

ఆ ఆఫీసరు మా చుట్టం, స్నేహితుడు అని చెప్పుకుంటారు. పరిచయాలు చేసుకునేందుకు తాపత్రయపడుతుంటారు. పదవులు ముగియగానే ఇవన్నీ మారిపోతాయి. కాని వ్యక్తి వయసు మీరినా, చేతకాకపోయినా, ఉద్యోగం మానుకుంటే స్నేహాలు, బంధుత్వాలు ఆగిపోతాయి. పలకరించేవారు కూడ వుండకపోవచ్చు. పదవీ, హోదాలకు వున్న గౌరవం సన్నగిల్లి తరువాత కొట్టొచ్చినట్లు తెలుస్తుంది.

అసలు స్వంత ఇంట్లోనే పరిస్థితుల తేడాను గుర్తించవచ్చు. సంపాదన లేని వ్యక్తి పట్ల ప్రవర్తన సన్నగిల్లుతుంది, మారిపోతుంది. అది మానవ స్వభావం. ఉద్యోగ విరమణ అంటే భయపడడానికి కారణాలలో ఇవి ముఖ్యమైనవి. జీవితంలో సరియైన సమయంలో ఈ విషయాల గురించి విచారిస్తే, తరువాతి పరిణామాల ప్రభావాలను తగ్గించుకోవచ్చు. దైవ ధ్యానం, ఆధ్యాత్మిక చింతన చివరి దశకు మాత్రమే తగినవి అని భావించడం సమంజసం కాదు.

**పాలలోని వెన్న వలె, బాహ్యంగా కనిపించే విశ్వము, బ్రహ్మమునందే కలదు. సకల కార్యకలాపాలకు బ్రహ్మమే ఆధారము. కావున బ్రహ్మము సర్వవ్యాప్తమై యున్నది.**

- ఆత్మబోధ

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ మస్తాన్ స్వామి

మల్లాది ఫణిమాల

శ్రీ మస్తాన్ స్వామి గాఢ విశ్వాసం గల ఒక ముస్లిం. ముస్లిం మతంలో జన్మించినా, శ్రీరమణుల పట్ల ఆకర్షితులయ్యారు. ప్రథమ సమావేశంలోనే శ్రీరమణులను తన గురువుగా స్వీకరించారు. మస్తాన్ స్వామి యొక్క గ్రామానికి చెందిన అఖిలాండమ్మ అని పిలువబడే ఒక భక్తురాలు తిరువణ్ణామలైకి తరచుగా వెళుతూండే వారు. ఆమె తిరువణ్ణామలైకి వెళ్ళినప్పుడల్లా శ్రీరమణులను దర్శించుకుని, వారికి వంట వండి పెట్టేవారు. అలా అఖిలాండమ్మ తో పాటు, మస్తాన్ స్వామి ఒకసారి శ్రీభగవాన్‌ను దర్శించుకుందా మని, విరూపాక్ష గుహకు వెళ్ళటం జరిగింది. శ్రీ కావ్యకంఠ గణపతి ముని మొట్ట మొదటి సారిగా శ్రీరమణ దర్శనం చేసుకున్నది 1903వ సంవత్సరంలో. మస్తాన్ స్వామి అంతకు పూర్వమే శ్రీరమణుల వద్దకు వచ్చారని, శ్రీరమణులే విశ్వనాథస్వామితో చెప్పడం గమనార్హం. మస్తాన్ స్వామి నేత పని చేసుకునే కుటుంబంలో జన్మించారు. వారు బాల్యం నుండియే వారి తల్లిదండ్రులకు నేతపనిలో సహాయపడే వారు. ఆ పనిచేస్తూ, మధ్యలో, అదేమిటో తెలియకుండానే సమాధి స్థితిలోకి వెళ్ళిపోయే వారు. చిరుప్రాయం నుండీ ఇలా జరగడాన్ని గమనించిన వారి తల్లితండ్రులు మస్తాన్ పనిచేస్తూ అలసిపోయి, నిద్రలోకి

జారుకుంటున్నాడని భావించేవారు. ఆ విధంగా నిద్రిస్తున్న మస్తాన్ స్వామిని చూసినప్పుడల్లా, వారు అతనిని గట్టిగా దెబ్బలు వేసి, నిద్ర లేపి పనికి పునః ఉపక్రమించమని ఆదేశించేవారు. వారి బాల్యం నుంచీ ఇటువంటి సందర్భాలు ఎన్నెన్నో ఉన్నాయి. దీనిని బట్టి, శ్రీ మస్తాన్ స్వామి స్వభావసిద్ధంగానే చుట్టూ పరిసరాల నుండి, మనుష్యుల నుండి విడివడి ఉండేవారని మనం గ్రహించాలి. అసాధారణ భక్తుడైనటువంటి మస్తాన్ స్వామి, మొట్టమొదటిసారిగా, విరూపాక్ష గుహలో తనకు జరిగిన శ్రీరమణ దర్శనం గురించి ఇలా వివరించారు. "శ్రీరమణులు శిల వలె కూర్చుని ఉన్నారు. నిశ్చలమైన ఆయన చూపు అనుగ్రహము, కరుణ, జ్ఞానముతో కూడియున్నది. నేను వారి ప్రక్కన నుంచున్నాను. శ్రీరమణులు నావైపు ఒకసారి చూచుట ద్వారా, నా హృదయ కవాటాన్ని తెరచారు. అలా చేసి, ఆయన స్థితిలోనే నేను కూడా స్థిరపడిపోయేలాగ శ్రీరమణులు నన్ను అనుగ్రహించారు. ప్రథమ దర్శనంతోనే, కేవలం శ్రీ భగవాన్ యొక్క కృపా కటాక్ష వీక్షణంతో, ఏ మాత్రం అలసట లేకుండా, హృదయంలో మునిగిపోయి, శాంతిగా ఎనిమిది గంటల పాటు ఉండిపోయాను". ప్రథమ దర్శనంలోనే శ్రీ రమణుల అనుగ్రహాన్ని ఇంతగా సంపాదించుకున్న మస్తాన్ స్వామి ఎంతో పరిపక్వత చెందిన భక్తులని, సాధకులని వేరే చెప్పవలసిన అవసరం లేదు కదా!!

ఇలా అరుణాచలం వచ్చి శ్రీరమణుల సన్నిధిలో కూర్చున్న మస్తాన్ స్వామి ఎన్నోసార్లు సమాధి స్థితిలోకి వెళ్ళిపోయేవారు. శ్రీ

భగవాన్ సన్నిధి యొక్క శక్తి ప్రభావం చేత మస్తాన్ స్వామి, పై చెప్పబడిన రీతిలో అనేకసార్లు హృదయ కుహరంలోకి వెళ్ళి, ఆత్మస్థితిని పొందేవారు. శ్రీ రమణులే, మస్తాన్ స్వామి తొలినాళ్ళలో తమ వద్దకు వచ్చినపుడు జరిగిన విషయాలను విశ్వనాథస్వామితో ఈ విధంగా వివరించారు:

అన్ని రకముల వారు జ్ఞాని పట్ల ఆకర్షితులౌతారు. (స్వర్గలోక వాసులైన) దేవతలు, ఋషులు, బ్రహ్మ విష్ణులు, యోగులు, సిద్ధులు, మునులు మొదలైన వారందరూ కూడా జ్ఞాని సన్నిధి వైపు ఆకర్షితులౌతారు. అట్టివారిలో కొందరు సాధారణ మానవుల రూపంలో వస్తే, మరికొందరు సూక్ష్మ శరీరములతో వస్తూ ఉంటారు. కొందరు మహాత్ములు బిచ్చగాళ్ళ వలెను, పిచ్చివారి వేషములోనూ కనిపిస్తూంటారు. కొందరు జంతువుల, పక్షుల రూపాలలో కూడా వస్తూంటారు. అయితే సాధారణ మానవ దేహము ధరించి వచ్చి భక్తులుగా నిలిచిపోయే వారిలో, ఆధ్యాత్మిక పరిపక్వత ఎక్కువగా ఉంటుంది. మరి కొంతమంది పక్వమునకు వచ్చి రాలిపోవుటకు సిద్ధముగా ఉన్న పండ్లవలె ఉంటారు. అటువంటి సాధకులు కేవలం ఆత్మలో గాఢంగా నిల్చిపోవడానికే జ్ఞాని వద్దకు చేరుకుంటారు. మస్తాన్‌స్వామి ఆ కోవకి చెందిన భక్తుడు'' అని శ్రీరమణులు సెలవిచ్చారు.

శ్రీ మస్తాన్ స్వామి ఎంత పరిపక్వత చెందిన వారంటే, ఆయన శ్రీరమణ దర్శనార్థం విరూపాక్ష గుహకు వచ్చినప్పుడు, కొన్నిసార్లు గుహలోకి ప్రవేశించుటకు ముందే, గాఢ సమాధి స్థితిలోకి

వెళ్ళిపోయేవారు. గేటుపై చెయ్యి పెట్టగానే గాఢ సమాధి స్థితి లోనికి వెళ్ళి, నిశ్చలంగా, ఏ మాత్రమూ కదలిక లేక, నిలిచి పోయేవారు మస్తాన్ స్వామి. ఇలా ఒకసారో, రెండుసార్లో కాదు, అనేకసార్లు జరిగింది. వారు శ్రీరమణులను కనీసం చూడనైనా చూడక ముందే ఇలా జరిగిపోతుండేది.

శ్రీ మస్తాన్ స్వామి బహుముఖ ప్రజ్ఞాశాలి. వారు ఒక అద్భుతమైన వ్యక్తి. బయటకు అతి సాధారణంగా కనిపించినా, ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నత స్థాయికి చెందిన సాధకులు. తోటి భక్తుల పట్ల ఎనలేని దయ కలిగి ఉండేవారు. ఇతరులకు సహాయము చేయడానికి, ఎప్పుడేమి అవకాశం వస్తుందా! అని ఆతృతతో ఎదురు చూసేవారు. మస్తాన్ స్వామి ఇంత స్నేహశీలత్వం కలవారు కనుకనే, అఖిలాండమ్మ శ్రీ భగవానులను దర్శించు కోవటానికి అరుణాచలం వెళదామా మస్తాన్? అని అడగగానే, క్షణం ఆలోచించకుండా, నేత పనిని పక్కకు పెట్టేసి, శ్రీరమణులను కొన్నాళ్ళు సేవించుకుందామనే సంకల్పంతో, అఖిలాండమ్మతో కలిసి అరుణాచలం వచ్చేవారు మస్తాన్ స్వామి. అఖిలాండమ్మ పప్పులు, ఉప్పులు, నెలవారీ కొని, వాటిని మూటగా కట్టి మస్తాన్ స్వామి నెత్తి మీద పెట్టేవారు. ఆ రోజుల్లో బస్సులు కూడా లేవు. శ్రీరమణులకు వంట వండి పెట్టుటకు సరిపడే సరుకులు, ఈ విధంగా నెత్తిమీద పెట్టుకుని, మస్తాన్ స్వామి మరియు అఖిలాండమ్మ, నెమ్మదిగా నడుచుకుంటూ, 40 మైళ్ళ కాలినాడకన, శ్రీరమణుల దివ్య కథలను ఒకరితో ఒకరు పంచుకుంటూ, దేసూరు

నుంచి అరుణాచలం చేరుకునేవారు. ఇలా అరుణాచలం చేరుకున్నాక, కొన్ని నెలలపాటు మస్తాన్, అరుణాచలం అగ్రహారాలలో భిక్ష చేసుకుంటూ, తీవ్ర సాధన చేస్తూ, శ్రీరమణుల దివ్య సమక్షంలో ఎంతో తృప్తిగా, ఆనందంగా కాలం గడిపేవారని, అఖిలాండమ్మ తరచూ, తోటిభక్తులతో మనవి చేసుకునేవారు. శ్రీరమణులకు, తన చేతులతో కౌపీనాలు నేసి, బహుకరించిన ఘనత కేవలం మస్తాన్ స్వామికి మాత్రమే చెందినది. మస్తాన్ చేసే నేతపని, తనకు అన్నం పెట్టకపోయినా, నాకు చక్కటి కౌపీనాలను సమర్పించింది అని ఎంతో వాత్సల్యంగా శ్రీరమణులు మస్తాన్‌స్వామిని, వారి కార్యదీక్షను, గురుభక్తిని తరచు ప్రశంసించేవారు.

ఇలా ఎన్నో సంవత్సరాలుగా మస్తాన్ స్వామి, అఖిలాండమ్మా, అరుణాచలం వచ్చి శ్రీరమణులను భక్తితో సేవించుకునేవారు. ఇలా కొంత కాలం గడిచాక, వారిద్దరూ కలిసి దేసూర్‌లో ఒక మఠం ప్రారంభిద్దామనే నిర్ణయానికి వచ్చారు. సాధువులకు, తీర్థయాత్రలు చేసేవారికి ఈ మఠంలో భోజన, నివాస సౌకర్యము ఏర్పాటు చేయాలన్నది వారి సదభిప్రాయము. ఆ మఠం యొక్క నిర్మాణములో మస్తాన్ స్వామి ఎంతో సహాయం చేశారు. మఠాన్ని నిర్మించడానికి ఎంచుకున్న ప్రదేశాన్ని మస్తాన్ స్వామి స్వయంగా శుభ్రం చేసి, అచ్చటి భూమిని మఠ నిర్మాణానికి వీలుగా వుండేట్లుగా తయారు చేశారు. శ్రీరమణాశ్రమం నుంచి కూడా అనేక మంది సాధువులు దేసూర్‌లోని ఈ మఠానికి వేంచేసేవారు. ప్రత్యేకంగా,

ఆరోగ్యం బావులేనివారు,మస్తాన్ స్వామి మరియు అఖిలాండమ్మ ప్రారంభించిన ఈ మఠానికి వచ్చి, అచ్చట అఖిలాండమ్మ వండిపెట్టే భోజనం స్వీకరిస్తూ, తమ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునేవారు. ఆ మఠంలో మస్తాన్‌స్వామి క్రమం తప్పకుండా, ప్రతీరోజూ, శ్రీరమణులు గ్రంథస్తం చేసిన పుస్తకాలని పారాయణ చేసేవారు. మస్తాన్ స్వామి నేత పనిని పూర్తిగా వదిలేసి, మఠం యొక్క సేవలో విలీనమై పోయారు.

మస్తాన్ పరిపక్వత నొందిన సాధువులాగ జీవితాన్ని గడిపేవారు. భిక్ష చేసుకుంటూ, లేక అఖిలాండమ్మ వండి పెట్టినది తినేవారు. దేసూర్ వచ్చిన భక్తులను మఠానికి తీసుకువెళ్ళి శ్రీరమణుల గురించి, వారి దివ్య బోధను గురించి ఆసక్తికరంగా వారందరికి చెప్పేవారు. 1928వ సంవత్సరంలో నందగోపాల్ ముదలియార్ అనబడే అతను, కొంత డబ్బు ఇచ్చి, ఆ మఠానికి ఉత్తర దిక్కున మరో కొత్త నిర్మాణం కట్టించారు. అక్కడ గోడమీద నందగోపాల్ ముదలియార్ అనునతడు డబ్బు సహాయం చేసి, ఈ మఠాన్ని అభివృద్ధి పరచారని వ్రాసి పెట్టించుకున్నాడు. శ్రీరమణులకే అంకితమైన ఈ మఠమునందు మరొకరి పేరు ఉండటం మస్తాన్ స్వామికి ఎంత మాత్రము నచ్చలేదు. శ్రీ భగవానుల పట్ల వారికి ఉన్న భక్తి, శరణాగతులే దీనికి కారణం. అందుచేత దేసూర్‌లో ఆ మఠం నుంచి దూరంగా వెళ్ళిపోదామని మస్తాన్ సంకల్పించారు. వారు 'మాటమ్' అనే ఊరు చేరుకున్నారు. అఖిలాండమ్మ దేసూర్ లోనే నివసించసాగారు. వారిద్దరూ తరచు మునుపులాగే నడిచి

గానీ, ఎడ్లబండిలో పప్పులు, సరుకులు నింపుకుని శ్రీ భగవాన్‌ను దర్శించుకుని, వారికి వండిపెట్టి, సేవించుకుందామని, అరుణాచలం వెళుతూ ఉండేవారు.

అఖిలాండమ్మ శ్రీరమణులకు, వారిద్దరు దేసూర్‌లో ప్రారంభించిన మఠం గురించి చెప్పగా, శ్రీరమణులు దేసూరమ్మ దేసూరులో శ్రీ రమణానంద మఠాలయాన్ని స్థాపించి, సేవ చేస్తోంది అని అందరితో అన్నారు. మస్తాన్ స్వామి మఠం వదలి దూరంగా వెళ్ళిపోయారని, అఖిలాండమ్మ శ్రీరమణులకు చెప్పినప్పుడు, శ్రీరమణులు ఆమెను దేసూర్ వదిలి, మస్తాన్‌స్వామి వద్దకు వెళ్ళి, వారి బాగోగులు చూసుకుంటూ వుండమని ఆదేశించారు.

అఖిలాండమ్మ భగవాన్ చెప్పిన మాటలను ఆజ్ఞగా భావించి, దేసూర్ విడిచి, మస్తాన్ స్వామి ఉన్న ఊరికి వెళ్ళారు. అచ్చట ఆమె మస్తాన్ స్వామిని కనిపెట్టుకుని వుండేవారు. 1920 నుంచి 1930 వరకు మస్తాన్ వీలున్నప్పుడల్లా అరుణాచలం వెళ్ళి శ్రీరమణులను సేవించుకునేవారు. 1931 సంవత్సరం వరకూ కూడా వారు 'మాటమ్' అనే గ్రామంలోనే నివసించారు. 1931వ సంవత్సరంలో నవంబర్ 8వ తేదీన వారు శివైక్యం చెందారు. మస్తాన్ స్వామికి వారు ఎప్పుడు మరణిస్తారో, ఏ సమయానికి ప్రాణాలు విడువ నున్నారో ముందుగానే తెలియవచ్చెను. ఈ వివరాలన్నీ వారిని కనిపెట్టుకుని ఉన్న మునిస్వామి గౌండర్ అనే వ్యక్తికి ముందుగానే తెలియపరిచారు. కానీ మునిస్వామి గౌండర్ మస్తాన్ స్వామి చెప్పిన మాటలు పట్టించుకోలేదు.

వారు రేపు ప్రాణాలు విడుస్తారనగా, ముందురోజు ఆ ఊళ్ళో ఉన్న శ్రీరమణ భక్తులందరినీ వారి వద్దకు రమ్మని సందేశం పంపించారు, శ్రీ మస్తాన్ స్వామి. కొందరు వారి సందేశం అందక, మరి కొంతమంది భక్తులు చాలా దూరంలో ఉండటం చేత, మస్తాన్ స్వామి వద్దకు రాలేకపోయారు.

మస్తాన్ స్వామి చివరి క్షణాల్లో అఖిలాండమ్మ వారి చెంతనే ఉన్నది. నిజమైన భక్తులు చివరి రోజులు ఎంత దివ్యంగా గడుస్తాయో తెలుసుకునేందుకు మస్తాన్ స్వామి వారి చివరి రోజులు ఎలా గడిచాయో తప్పక తెలుసుకుని తీరాలి.

మస్తాన్‌స్వామి చివరి రోజులు చాలా చక్కగా గడిచిపోయాయి. ఆయన చివరి రోజుల్లో, అపస్మారక స్థితిలో ఉన్న మస్తాన్ స్వామి, ''నన్ను తీసుకుని వెళ్ళటానికి నంది దిగి వచ్చింది. శివుని యొక్క ప్రమథ గణాలు నృత్యం చేస్తూ నన్ను సమీపించుట నాకుతెలుస్తోంది'' అని తరచూ అనేవారు.

చివరి ఘడియల్లో వారు కళ్ళనీళ్ళు పెట్టుకుని, దేసూరమ్మతో, ''దేసూరమ్మా, నన్ను తీసుకుని వెళ్ళడానికి అపీతకుచాంబాళ్ తల్లి వచ్చారు. నేను వెళ్తున్నాను, దేసూరమ్మా'' అని చెప్పి కన్ను మూసారు. ఈ విషయం శ్రీరమణులకు చెప్పగా వారు ''జగన్మాతయే స్వయంగా మస్తాన్ స్వామిని తీసుకుని వెళ్ళటానికి వచ్చి ఉండవచ్చు'' అని అన్నారు. అంతేకాక, మస్తాన్ స్వామి ఏ ఆడంబరం లేకుండా, తన ఔన్నత్యాన్ని పైకి కనపడనీయకుండా

ఉండే వ్యక్తి అనియూ, ఆయనలో నిగూఢంగా చాలా ఆధ్యాత్మ అనుభవాలు నిండి వుండేవి అనియూ శ్రీరమణులు అన్నారు.

అటుపిమ్మట శ్రీరమణులు, రెండువేల అయిదు సంవత్సరాల క్రిందట వ్రాయబడిన 'తిరుమందిరమ్' అనే తమిళ గ్రంథంలో, ఆత్మ సాక్షాత్కారం పొందిన శివభక్తుల శరీరాలను ఎలా ఖననం చేయాలో చదివి, కుంజుస్వామికి వివరించి, సమాధి ఎలా నిర్మించాలో, మస్తాన్‌స్వామి శరీరాన్ని విభూది, కర్పూరము మరియు ఇతర ద్రవ్యాలతో ఎలా నింపాలో సవిస్తారంగా వివరించి, బోలెడు విభూది ఇచ్చి కుంజు స్వామిని 'మాటమ్' పంపారు. ఈ సుస్పష్టమైన సూచనలను పాటించి, మస్తాన్ స్వామి వారి సమాధి నిర్మించబడింది.

మస్తాన్ దేహం విడిచిపెట్టినప్పుడు పెద్ద వర్షం కురుస్తోంది. వర్షం కుండపోతగా కురుస్తున్నప్పటికీ గ్రామం మొత్తం తరలి వచ్చింది. ఆ ఊరిలోని ఒక దేవాలయం దేవుడిని ఊరేగించే రథాన్ని, ఆ ముస్లిం భక్తుని భౌతిక కాయాన్ని తీసుకుని వెళ్ళడానికి ఇచ్చింది. వేదమంత్రాల నడుమ మస్తాన్‌స్వామి శరీరాన్ని, శ్రీ భగవాన్ సూచనల ప్రకారం నిర్మించబడ్డ సమాధిలోనికి చేర్చారు. ఆ సమాధి నిర్మించిన పిమ్మట ఆ ఊరు ఎంతో అభివృద్ధి చెందిందని మునిస్వామి గౌండర్ తరచూ చెప్తుండేవారు. శ్రీ మస్తాన్‌స్వామి శివైక్యం చెందగా, వైకుంఠ సమారాధన పేరిట, మునిస్వామి గౌండర్ గారు 200 కేజీల బియ్యాన్ని వండించి, అందరికీ భోజనం

పెట్టించారు. మస్తాన్ స్వామి దేహంతో ఉన్నన్నాళ్ళు వారి అవసరాలను చూస్కుంటూ, వారికి సేవ చేసిన మునిస్వామి గౌండర్ గారు ప్రతి సంవత్సరము, శ్రీ మస్తాన్ స్వామి పుణ్యతిథి రోజున, ఆ ఊళ్ళో వున్న వారికందరికీ అన్నసంతర్పణ చేసేవారు. మునిస్వామి గౌండర్ బ్రతికున్నంత కాలం ఇది చక్కగా కొనసాగింది.

"మిన్ను విరిగి మీదపడినా, గుండెల్లో ఖడ్గము లోతుగా దించబడినా, మన స్వస్వరూపమునుండి, సహజస్థితి నుండి క్షణము కూడా, జారకూడదు" అని శ్రీ మస్తాన్ స్వామి తోటి భక్తులకు ఎల్లప్పుడూ చెప్తూ ఉండేవారట!!

ఇంత చక్కటి శ్రీ భగవానుల భక్తునికి మనం కూడా భక్తితో ప్రణామాలనర్పిద్దాము!!

**దేనినైతే చూచిన తరువాత, చూచుటకు ఏదియూ ఉండదో, ఏ స్వరూపమగుటచే తిరిగి సంసారంలో పడుట అసంభవమో, దేని యొక్క ఎఱుక చేత, ఇక తెలుసుకోవలసినదేమియూ ఉండదో, అదియే 'బ్రహ్మము' అని తెలుసుకొనుము.**

- ఆత్మబోధ

గమనిక: మే 2021 శ్రీరమణజ్యోతి 13వ పేజీలో, 14వ పంక్తిలో, 1896కు బదులుగా 1988 అని ముద్రించబడినది. పాఠకులు గమనించగలరు.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

"ఇంత తక్కువ భుజించినా, ఒకటి రెండు రోజులలో, ఇక్కడ, నాకు పొట్టలో బాగుండదు. ఈ మాత్రము కూడా నేను జీర్ణించు కోలేకపోతున్నాను" అని బదులిచ్చాను.

అంతే, ఆ తరువాత నేను ఆశ్రమంలో ఎన్నాళ్ళున్నా, జీర్ణకోశ సమస్య అనేది మళ్ళీ నాకు తలెత్తలేదు. ఉదయమూ, సాయంత్రమూ, ఆశ్రమంలోనే భోజనం చేసేవాడిని. ఈ సంఘటన ద్వారా రెండు విషయాలు ప్రస్ఫుటంగా తెలుస్తాయి. ఒకటి- శ్రీ భగవాన్ అన్ని విషయాలూ ఎంత నిశితంగా గమనిస్తారో అనేది; రెండవది - వారు తమ కటాక్ష వీక్షణంతో ఎంతటి బాధ నయిననూ మాయం చేయగలరు అనేది. ఇట్టి దైహికమయిన అవసరాలనే తీర్చదలచుకొన్న శ్రీ భగవాన్, మన అధ్యాత్మిక అవసరాల పట్ల నిర్లక్ష్యము వహిస్తారని నేననుకోను. కాకపోతే, రెండవ విషయములో వారు చూపు కరుణ, మొదటి విషయములోవలె తేట తెల్లముగా వుండక పోవచ్చును. ముఖ్యముగ నా వంటి క్లిష్టమయిన స్థితిలో ఉన్న వారి విషయంలో!

ఇంకొకసారి నేను చిత్తూరులో ఉన్నప్పుడు తీవ్రమైన అజీర్తితో బాధ పడ్డాను. ఏమి తిన్నా అరిగేది కాదు. పలచటి జావ తాగినా విరోచనాలయి పోయేవి. కొద్దిరోజులు యిలా బాధ పడిన తరువాత, నేను శ్రీ భగవాన్‌కు ఉత్తరము వ్రాశాను. నాకే కష్టమొచ్చినా శ్రీ

భగవాన్ దగ్గరకే వస్తాను. కాబట్టీ, అలాగే మర్నాడు బయలుదేరి వస్తున్నానని రాశాను. బయలుదేరి వెళ్తున్నప్పుడు, రైలులో కూడా విరోచనమయ్యింది. రాత్రి భోజన సమయానికి ఆశ్రమం చేరాను. ఆశ్రమంలో అందరిలాగా నాకూ వడ్డించారు. ఆ రోజు కొన్ని ప్రత్యేకమయిన మిఠాయిలు కూడా లభించాయి. బెంగుళూరుకు చెందిన శ్రీ శఠగోపన్ గారు, సంవత్సరానికి ఒకసారి శ్రీ భగవాన్‌కు చక్కటి భిక్షా కార్యక్రమం చేసేవారు. ఆ సందర్భంలో ప్రత్యేకమయిన మిఠాయిలు వడ్డనకు ఏర్పాటు చేస్తారాయన. ఆ విధంగా ఆ రోజు సాయంత్రం మా అందరికీ గొప్ప విందు ఏర్పాటయ్యింది. నేను ఎట్టి సంకోచమూ లేకుండా రుచిగా వున్న ఆ పదార్థములన్నీ శుభ్రంగా తినేసాను. మర్నాడు ఉదయం కూడా, అల్పాహారంతో పాటు, మరికొన్ని రుచికరమయిన పదార్థములు కూడా వడ్డించారు. మళ్ళీ అన్నీ తినేశాను నేను. 11 గం॥లకు మధ్యాహ్న భోజనం కూడా సుష్టుగా తిన్నాను. ఈ విందులతో శ్రీ భగవాన్ నా విరోచనాలను పూర్తిగా నయం చేసేశారు. కొద్ది రోజులుండి పూర్తి స్వస్థతతో నేను ఇల్లు చేరుకున్నాను.

ఇంకొకసారి కూడా శ్రీ భగవాన్ ఇలాగే నా పట్ల పితృవాత్సల్యం చూపించారు. ఒకరోజు ఉదయం 5 గం॥లకు గిరి ప్రదక్షిణకు బయలు దేరాను. దారిలో శ్రీ సర్వాధికారిగారి కార్యాలయం దగ్గర ఆగి, వారితో "గిరి ప్రదక్షిణకు వెడుతున్నాను. వచ్చేసరికి వీలైతే ఒక కప్పు కాఫీ దొరికితే బాగుంటది" అన్నాను.

"చూద్దాం!" అన్నారు శ్రీ సర్వాధికారి. నేను తిరిగి వచ్చేటప్పుడు, ఊళ్ళో హోటల్లో, యిడ్లీలు తిని, కాఫీ తాగి వచ్చాను. అయినా

ఇంకో కప్పు కాఫీ తాగితే బాగుంటుందనే ఉద్దేశంతో భోజనశాలకు వెళ్ళి కూర్చున్నాను.

ఒక అమ్మ వచ్చి నాకు దోశలు, కూటూ వడ్డించింది. ''ఇదేమిటి? నేను కాఫీ మాత్రమే కావాలన్నాను'', అన్నాను నేను. 'మీరు తీసుకోకపోతే శ్రీ భగవాన్ మమ్మల్ని కోప్పడతారు. దేవరాజ ముదలియార్ గిరి ప్రదక్షిణకు వెళ్ళారు. ఆయనకు కొన్ని దోశలు, కూటు వుంచండి' అని చెప్పారు. 'మళ్ళీ 11 గంటలకు మమ్మల్ని అడుగుతారు'' అని చెప్పింది ఆ అమ్మ.

ఆ రోజు ఉదయము ప్రతిరోజులాగానే 10.30 గంటలకు నేను స్తోత్రం ప్రారంభించాను. 'రమణ సన్నిధిమురై' నుండి 'అరుణాచల రమణేశన్' అనే పాట, ఆ రోజు నేను ఎన్నుకున్న స్తోత్రాలలో ఒకటి. ''నన్ను ఎంతో కరుణతో చూసి నా యోగక్షేమాలను గమనిస్తూ 'నన్ను కాపాడిన వారు తిరువణ్ణామల రమణేశన్' అనే పంక్తి రాగానే, అప్రయత్నంగా నా కళ్ళ నుండి అశ్రువులు జలజలా రాలాయి. భగవాన్ చూపించే మాతృవాత్సల్యం నన్ను కదల్చి వేసింది.

శ్రీ లక్ష్మణ శర్మగారు రచించిన 'ఉళ్ళదు నార్పదు' పై వ్యాఖ్యానము మూడవ ప్రచురణ ముద్రణలో ఉన్నప్పుడు, ప్రతి రోజు సాయంత్రమూ, శ్రీ భగవాన్, నేను, శ్రీ టి.ఎన్. రాజగోపాల్ పుస్తకం ప్రూఫులు చూసేవాళ్ళం. నాకు గుర్తున్నంత వరకూ, నేను చదివేవాడిని. శ్రీ భగవాన్ ఒక కాపీ చూస్తుంటే, శ్రీ రాజగోపాల్ ఇంకో కాపీ చూసేవారు. ఒకరోజు మధ్యాహ్నం నేను గిరి ప్రదక్షిణకు

వెళ్ళాను. సాయంత్రం 6.15 కల్లా ఆశ్రమానికి వచ్చేయగలననీ పుస్తక పఠనంలో పాల్గొనగలననీ అనుకున్నాను. కానీ నేను రావటంలో ఒక పావుగంట ఆలస్యమయ్యింది. పని మొదలు పెట్ట వచ్చనీ, నా బదులు ఇంకెవరైనా చదవ వచ్చనీ ఒకరు సూచించారు. శ్రీ భగవాన్ ఒప్పుకోలేదు. నేనొచ్చే దాక ఆగి, నేను వచ్చాక పఠనం కొనసాగించారు. చూడటానికి ఇది చిన్న విషయంలా కనిపించినా, అంతటి మహానుభావుడు అర్హతలేని నావంటి అల్పునిపై అంత కరుణ చూపుతుంటే వారి పట్ల నేను బలీయంగా ఆకర్షితుడను కావటంలో విశేషమేమున్నది? ఇలాంటి దివ్య ప్రేమ కేవలం నా ఒక్కడి సొంతమే కాదు. ఇంకనూ అనేక మంది, శ్రీ భగవాన్ కరుణకు యింతకు మించి ప్రాప్తులయ్యారు. నా ప్రయత్నమల్లా శ్రీ భగవాన్‌కు నాకూ మధ్య జరిగిన విశేషాలు నాకు గుర్తున్నంత వరకూ తెలియపరచడమే!

ఒకసారి నాకూ శ్రీ భగవాన్‌కూ జరిగిన సంభాషణ గురించి ఇక్కడ ప్రస్తావించ వచ్చును. శ్రీ భగవాన్ సన్నిధిలో నేను తాయుమానువర్ కీర్తన ఒకటి పాడుతున్నాను. ఆ పాట సారాంశము: "నా ఒక్కడిపై కరుణ చూపించి, నా మనస్సును నిశ్చలం గావించి ఈ బాధలన్నిటి నుండి విముక్తుడను గావించరాదా? ఈ ప్రపంచము నీకు అభ్యంతరము తెలుపుతుందా?"

నా మనస్సులో ఆ కోర్కె బలంగా ఉండటం వల్ల ఆ చరణం దగ్గర పాడటం ఆపి, శ్రీ భగవాన్‌ను, 'నాకలా చేయరాదా?' అని ప్రశ్నించాను.

‘‘ఒక్కరికి చేస్తే అందరూ అదే అడుగుతారు’’, అని బదులిచ్చారు శ్రీ భగవాన్. ‘‘ఇవ్వండి భగవాన్! నా కెట్టి అభ్యంతరమూ లేదు. సంపద అపారంగా ఉన్నప్పుడు ఎంత మంది కిచ్చినా నా కేమీ లోటురాదు కదా?’’ అని జవాబిచ్చాను.

ఇంకోసారి కూడా ఇలాంటి అభ్యర్థనే చేసినప్పుడు శ్రీ భగవాన్ మౌనం వహించారు. నా విన్నపం అంగీకరించరానిదని నాకు అర్థమయింది. ‘‘ఇంద్రియ సుఖాల కోసం మేము ప్రాకులాడు తాము- ఆ ఆనందమెట్టిదో మాకు తెలుసును కనుక. ఆధ్యాత్మిక జీవితములో అనుభవించగల తన్మయత్వము, అద్వితీయమూ, అమోఘము అని ఋషులు, మహాత్ములు చెబితే వినటమేకాని మాకు అనుభవైక వేద్యం కాదు. అందువల్ల మాకు దానిపై గురి కుదరదు. కనుక, శ్రీ భగవాన్ ‘‘ఆ బ్రహ్మానందాన్ని కొంచెము రుచి చూపకూడదా? ఆ రుచి తెలిసిన తరువాత మేము ఇంద్రియ సౌఖ్యాలను త్యజించి ఆత్మానందము కోసము శ్రమిస్తాము కదా!’’ అని మొర పెట్టుకున్నాను.

అన్ని విషయాలలో లాగానే, ఈ అభ్యర్థన కూడా పూర్తి చిత్త శుద్ధితో చేశాను. అప్పటికీ, ఇప్పటికీ నా నమ్మకం ఒక్కటే! ఆత్మ సందర్శనంతో కలిగే దివ్యానుభూతి, తాదాత్మ్యము, ఇంద్రియ సౌఖ్యాలతో రాదు అనే ప్రత్యక్షానుభవము - ఎంత కొద్ది సేపైనా - మనకు లభించినప్పుడు, మనము యితర ఆకర్షణలన్నింటినీ తృణీకరిస్తాము కానీ, ఆ అనుభవాన్ని క్షణిక మాత్రమయినా, ప్రసాదించటం వీలుకాదని తెలుసుకున్నాను. శ్రీరామకృష్ణ

పరమహంస, తమ అపార కరుణవలన, వివేకానందులకు ఆ స్థితి ప్రసాదించినందువల్ల, ఆ శక్తిని భరించలేక వివేకానందులవారు మూడు రోజుల పాటు విలవిలలాడి పోయిరని మనము చదువు కొంటిమి.

ఆ అనుభవమెట్టిదనిన, ఒక చిన్న పూరి గుడిసెలోనికి ఏనుగు ప్రవేశించిన, గుడిసె ఎట్లు కూలిపోయి పడిపోవునో, దేహము కూడా అపరిపక్వ స్థితిలో, ఆ శక్తిని భరించలేదు. కానీ, నాకు తోచేదేమి టంటే, మహర్షి తలచుకొంటే యేదైనా చేయగలరు. ఏనుగు వచ్చినా చలింపకుండా గుడిసెను బలోపేతం చేయగలరు.

కానీ, నాకు తెలిసినంతవరకూ శ్రీ భగవాన్ అందరినీ తమ సహజ వేగంలోనే పయనించ నిత్తురు గానీ తొందరపరచరు. మనిషికి స్వతహాగా వున్న ప్రకృతిని శ్రీ భగవాన్ మార్చే ప్రయత్నము చేయనే చేయరు. ఆత్మ సాక్షాత్కార మార్గములో కూడా మన స్థాయి ననుసరించియే మనలను నడిపించెదరు. కానీ తొందర పెట్టరు. ఈ సందర్భములో శ్రీ రవీంద్రనాథ్ ఠాగూరు గారి 'గీతాంజలి' లోని ఈ పద్యమునుదహరించుట బహు సమంజసము. కవి భగవంతునితో సంభాషిస్తూ ''ప్రభూ! నీ కరములలో కాలగమనము అనంతము. రాత్రులూ, పగళ్ళు - యుగములే - పూలవలె వికసించి వాడి పోతవి. వేచి యుండుట ఎట్లునో నీకు తెలియును. ఒక చిన్న గడ్డిపువ్వును తీర్చిదిద్దుటకు నీకు శతాబ్దములు గడిచి పోవును. మేము ఆగలేము, మాకా ఓపిక లేదు. అవకాశముల కొరకు ప్రాకు లాడుతామే కాని మాకు వేచియుండుట చేతకాదు''.

1935లో, ఆశ్రమంలో దాదాపు 20 సంవత్సరాల వయసున్న ఒక యువకుడిని చూశాను. ఆ అబ్బాయి నాగర్‌కోయిల్‌లో జిల్లా మున్సిఫ్ కోర్టులో పనిచేస్తున్నాడు. ఆశ్రమంలో నాలుగైదు రోజులు కలిసి వుండటంతో అతనికి నాతో సాన్నిహిత్యం పెరిగింది. నాకో విషయం చెప్పాడు: తనకొక పిన్నవయస్కుడైన మహాత్ముడు పరిచయమయ్యాడనీ, ఆయన దీవెన వల్ల తనకు లైంగిక ఆలోచనలు పూర్తిగా నశించి పోయి స్త్రీలందరినీ తల్లులు గానూ, తోబుట్టువులుగానూ చూడగలుగుతున్నానని చెప్పాడు. ఇది నాకు చాలా విశేషమనిపించి, మనస్సులో హత్తుకు పోయింది. ఆ తరువాత అతను నాకు మళ్ళీ కనపించలేదు. అతని పేరు కూడా మర్చిపోయాను.

చాలాకాలం తరువాత, ఈ విషయం శ్రీ భగవాన్‌తో కూడా ప్రస్తావించాను. కొన్ని సంవత్సరాలుగా శ్రీ భగవాన్‌ను తరచుగా దర్శిస్తున్నప్పటికీ, వారితో సాన్నిహిత్యం పెరిగినప్పటికీ నాలో ఎట్టి మార్పు కానీ ఆధ్యాత్మికంగా నాలో ఔన్నత్యంగానీ నాకు కనిపించ లేదు. ఆశ్రమంలో స్థిరనివాసి ఐన తరువాత ఈ చింత ఇంకా ఎక్కువైంది. అలాంటి సందర్భములలో శ్రీ భగవాన్ దగ్గరకు వెళ్ళి అడిగేవాడిని. ఒకసారి శ్రీ భగవాన్‌తో ఫిర్యాదు చేశాను. "శ్రీ భగవాన్ సన్నిధిలో ఉంటున్నా నా కోర్కెలేమీ తగ్గలేదు. ఆ అబ్బాయి చెప్పినది నిజమైతే శ్రీ భగవాన్ కూడా నా కోర్కెలనన్నిటినీ అణచి వేయవచ్చు కదా. బహుశా అలా అణచి వేయడము మాకు మంచిది కాదని శ్రీ భగవాన్ ఊరుకుంటున్నారేమో" అన్నాను. శ్రీ భగవాన్ మాట్లాడ లేదు. బహుశా నా ఆలోచన సరియైనదేమో అని ఊరుకున్నాను.

ఒకటి రెండుసార్లు కాదు చాలాసార్లు నేను ఎట్టి పురోగతి సాధించలేదని శ్రీ భగవాన్‌తో మొరపెట్టుకున్నాను. ఒకసారి, కోర్కెలను అదుపులో పెట్టుకోలేకపోతున్నానని, కీ. శే. దైవశిఖామణి ముదలియారుగారు రచించిన పాట ఒకటి పాడాను. (వీరు కడలూరు సోమసుందరం పిళ్ళేగారి భార్య ఉమ తాతగారు). పాట సారాంశమిది: నాకు ధనమక్కర్లేదు, ప్రపంచ మక్కర్లేదు? కాని నేను స్త్రీలను మాత్రము చెరుకు వంటి తీపి పదార్థాలుగా భావిస్తాను. ఇది నా పూర్వజన్మ కర్మ ఫలమా? అమ్మా నేను అలిసిపోయాను. నన్ను ఆదుకో.

శ్రీ భగవాన్ నా బాధను తేలికగా తీసివేశారు. కాలక్రమేణా అన్నీ పోతాయి. చింతించాల్సిన పనిలేదు. ఎంత ధ్యానం చేస్తే అంత త్వరగా వాంఛలన్నీ నశిస్తాయి''.

ఇంకొకసారి కూడా, నాకు పురోగతి లేదని గోలపెడితే, శ్రీ భగవాన్, ''నీకెలా తెలుసు?'' అని క్లుప్తంగా తుంచి వేశారు.

ఏమి చేయలేక నన్ను నేనే ఇలా ఒక్కోసారి సముదాయించు కునేవాడని; ''బహుశా ఒక రోజు నేను పూర్తిగా మారిపోతానేమో?'' అలా ఆలోచించుకుంటూ, ఒకసారి శ్రీ భగవాన్‌ను అడిగాను; ''ఆధ్యాత్మిక పురోగతి నెమ్మది నెమ్మదిగా జరుగుతుందా లేక ఆకస్మాత్తుగా ఒక విస్ఫోటంలాగా జరుగుతుందా?'' శ్రీ భగవాన్ ఇలా సమాధానమిచ్చారు, ''ఒక చీకటి గుహలోనికి దీపం తీసుకు వెళ్ళినప్పుడు, లోని చీకటి ఒక్కసారిగా పోతుందా లేక నెమ్మది నెమ్మదిగా పోతుందా?'' *(సశేషం)*

# శ్రీరమణ మహర్షి సూక్తులు

కమలాకర వేంకట రావు

## చిత్తనిరోధం ప్రధానం

ప్రాణాయామమే ముఖ్య లక్ష్యం కాదు. దానిపైన ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి అనేవి ఉన్నాయి. ఇవి చిత్తనిరోధానికి సంబంధించినవి. ప్రాణాయామాభ్యాసకులకు ఇవి సులభగమ్య మౌతాయి. కనుక ప్రాణాయామ సాధనకు ముఖ్య లక్ష్యం చిత్త నిరోధమే, కొందరు, ఉత్తమాధికారులు ప్రాణాయామంతో కాలం వృథాపుచ్చక, సరాసరి చిత్త నిరోధానికే కృషి చేస్తారు. కేవల ప్రాణాయామం వల్ల సాధకునికి కొన్ని సిద్ధులు కలిగితే కలుగవచ్చు.

## చిత్తనిరోధం - శ్వాస నిరోధం

నాహం, కోహం, సోహం - అనే విచారపూర్వక ప్రాణాయామం చెయ్యలేనివారికి ధ్యానాభ్యాసం శ్వాస నిరోధం కలిగించి చిత్తచాంచల్య ముడుపవచ్చు. చిత్తనిరోధం వల్ల శ్వాసనిరోధం దానంతటదే సిద్ధిస్తుంది. అనగా, గాలి వదలడం, పీల్చడం అనే రేచక పూరకాలతో పనిలేకుండా గాలి తనంతట తానే నిలిచిపోయే కేవల కుంభకం అలవడుతుంది. ఇది కూడా చెయ్యలేని వారికి సాధారణ ప్రాణాయామం చిత్తనిరోధం కొరకు విధించబడింది.

## చిత్త శుద్ధి

కర్మను భగవదర్పితం చెయ్యడం వల్ల చిత్తశుద్ధి కలుగుతుంది. అయితే కర్మ చేసినప్పుడే భగవంతుని స్మరిస్తే చాలదు. భగవంతుని స్మరణ నిర్విరామంగా, సంతతప్రవాహంగా కొనసాగాలి. అప్పుడే చిత్తం విశుద్ధమవుతుంది.

## చిత్ప్రకాశం

చిత్ప్రకాశం సూర్యప్రకాశం వంటిది కాదు. సూర్య ప్రకాశం జడం. అది చీకటిని పారద్రోలి వస్తువులను ప్రకాశింప జేస్తుంది. చీకటి సూర్యుని వెలుగు ముందు నిలువజాలదు. కాని చైతన్యపు వెలుగు ముందు నిలువ గలుగుతుంది. వెలుగు చీకట్లను రెంటినీ ప్రకాశింపజేయగలది చిత్ప్రకాశం. అట్లే, జ్ఞానా జ్ఞానాలను రెంటినీ ప్రకాశింపజేయగల విశుద్ధ చైతన్యమది.

## జగత్తు శివమయం

జగత్తులో కనిపించే రూపాలు వట్టి రూపాలు కావు. చైతన్యముతో కూడిన రూపాలు. అజ్ఞాని వాటిని రూపాలుగా చూస్తాడే తప్ప, శివుడే ఆయా రూపాలలో కనిపిస్తున్నాడని తెలుసుకోడు. ఈ రూపాలను ధరిస్తూ వున్న సత్పదార్థమూ శివుడే, వాటిని తెలుసుకుంటూ ఉన్న చిత్పదార్థమూ శివుడే. అనగా, దృశ్యానికీ, ద్రష్టకూ రెండిటికి కూడా అధిష్ఠానమైనవాడు శివుడు.

## జగత్తు శివస్వరూపం

ప్రతివాడూ చైతన్య స్వరూపుడే, కనుక శివ స్వరూపుడే. అతనిచే తెలియబడినదీ, తెలియబడనిదీ - సమస్తము శివ స్వరూపమే. అయినా అట్టి అజ్ఞానం వల్ల అతడు తాను చూచేది నానా రూపాత్మకమైన జగత్తు ననుకుంటున్నాడు. ఆత్మదర్శనం అతనికి కలిగిననాడు జగత్తు తనకంటె వేరు లేదని తెలుసుకొంటాడు. రూపాలు రూపాలుగా కనిపిస్తూ వాటి వేరుతనం అంతర్ధానమౌతుంది. జగత్తు శివస్వరూపంగా గోచరిస్తుంది.

# Overcoming Fear

Dr.K.Subrahmanian

*Vedanta vakyeshu sadaa ramanto*
*Bhikshanna maathrena cha tushtimantah*
*Vishokavantah Karaneikavantha*
*Kaupinavantha khalu bhagyavantha*

Shankara says the happiest people are those who wear the minimum of clothes; they wear only a *kaupina* - *kaupinavantah*; *kalubhagyavantha* – such people are very lucky. Fortunate are the people who live on a little *bhiksha*. Such people depend on very little food and very little clothing. *Vedanta vakeshusadaramantah* - they are always supremely happy because their mind is always focused on *vedantavakya*. These people also have no *shoka* of any kind, whatsoever - *vishokamantah*.

When we read this, we are greatly impressed, but when it comes to actually practising it, we hesitate. We say that such things are all right for the Shankaracharya, but not for me. We don't ask ourselves, "Why not?" This is the problem. We don't have time to sit down and find out why we are doing what we are doing. The moment we have a desire, we want to fulfill it. There is profound truth in what Shankara said. After all, what is it we need in life? We require only two square meals a day, and a place to sleep. If someone tells you,"I will give you two square meals - two sumptuous meals- every day for the rest of your life," will you be satisfied? You won't be because you always want more. For example, when you have a job, you say,

“When I retire, if I get a pension of one thousand rupees, it is all right.” When you actually get a pension of one thousand rupees, however, you are not happy, because you were getting a salary of three or four thousand rupees earlier. You’re always afraid that you may have to go to other people in case you need some more money, and therefore, you tell yourself, “I must have money. I should have something so that I can make use of it in case of an emergency.” From morning to evening, you spend your time thinking about the money you have. You’re afraid that something may happen; that you may lose it. Therefore, you cling to it.

Similarly, you’re afraid of losing relationships. Even when things are normal, you’re afraid that something might happen to break it. So, what is happening is that every day, you have as your constant companion - sometimes, even in our dreams - fear. You are afraid to go to the office for you are afraid of what might happen to you there. You leave your home and you are afraid that you might miss the bus or train. When you are asked to do something, you are afraid that you might not be able to do it. Somebody takes ill in your family, and you’re afraid that the person might die. I become ill myself, then I am afraid that I might die. Your whole life is based on fear; fear of losing your life, property, children, and at a higher level, fear of losing your peace of mind. This fear can be physical or psychological.

Every human being is afraid of something or the other. Is it possible for somebody to be free of fear? What do

